## క్లుప్తంగా

### అల్లిపేట గుట్టపై ఆలయ అభివృద్ధి పనులు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రం సమీపంలోని అల్లిపేట గుట్టపై ఉన్న పురాతన పద్మనాభస్వామి ఆలయం పరిసరాల్లో ఉన్న ముళ్ల పొదలను శనివారం ఖిల్లాఘనపురం పురాతన దేవాలయాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో తొలిగించారు. ఆర్కియాలజిస్టు అధికారి వెంకట్‌రాములుతో పాటుగా కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయం పరిసరాలలో ఉన్న చెత్తాచెదారం, ఆలయం లోపలి భాగంలో శుభ్రపర్చి పూజలు చేశారు. కార్యక్రమంలో పురాతన ఆలయాల కమిటీ సభ్యులు కాశీనాథ్, శ్రీనివాసులు, విక్రం, పురుషోత్తం ముదిరాజ్, అభిలాష్, గోపాల్ పాల్గొన్నారు.

### బాధితులకు న్యాయం చేయాలి



వనపర్తి: జిల్లా కేంద్రంలోని మరికుంట చెరువులోని ఎఫ్‌టీఎల్ భూమిలో ప్లాట్లు కొని మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్లాట్లను అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సతీష్‌యాదవ్ మాట్లాడుతూ.. చెరువుకట్టకు అతి సమీపంలోని ప్రదేశం ఎఫ్‌టీఎల్ గాని, బఫర్‌జోన్ పరిధిలోకి వస్తాయని, కానీ చెరువును పూడ్చి అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, అక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇచ్చిన మున్సిపల్ అధికారులపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాములు, సుధాకర్, రమేష్, చంద్రయ్య, లక్ష్మణ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

### విద్యార్థులు కష్టపడి చదవాలి



ఖిల్లాఘనపురం: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు, సోళీపురం ఉప సర్పంచ్ రాంరెడ్డి అన్నారు. శనివారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉత్తమ బోధన చేసిన విద్యార్థులను అభినందించారు. అంతకు ముందు పాఠశాలలో జరుగుతున్న మన ఊరు మన బడి పనులను హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో శశిధర్‌రెడ్డి, శశి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఆటో భగవంతు అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ కార్యకర్తలతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, మండల మీడియా కన్వీనర్ రమేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### తెగుళ్లతో అప్రమత్తం

పెబ్బేరు: మండలంలోని బునాదిపూర్, రంగాపూర్, రాంపూర్ శివారులో వరి పంటలను శనివారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగిలో సాగు చేసిన వరి పంటలకు వస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నరేష్, రైతులు మద్దిలేటి, శేఖర్, కురుమన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

- సీసీ రోడ్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి
- ప్రజలు ముందుండి పనులు పర్యవేక్షించాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ



సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహ్మద్‌ఖాజా

అమరచింత: పట్టణంలో సీసీ రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని 5, 10వ వార్డులో జరుగుతున్న సీసీ రహదారుల పనులను శనివారం మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఈమేరకు చైర్‌పర్సన్ మంగమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం ఆయా వార్డుల్లోని ప్రధాన రహదారులకు సీసీ చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ కాలనీలో రూ.50లక్షలతో సీసీ రహదారులు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా వార్డుల్లో సీసీ రహదారులు, డ్రెయినేజీల నిర్మాణాలకు ఎంత మేరకు ఖర్చు అవుతుందో అన్న విషయాలను కౌన్సిలర్లు, ఏఈతో చర్చించి సరైన అంచనా ప్రకారం సుమారు రూ. 4.10 కోట్లు కేటాయించామన్నారు.

**ప్రజల సహకారంతోనే..**

పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి మున్సిపల్ పాలక వర్గం కృతనిశ్చయంతో ఉందని, ప్రజలందరూ సహకరించాలని చైర్‌పర్సన్ కోరారు. ముందు తరాలకు ఉపయోగపడేలా రహదారులు నాణ్యతతో నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశించామన్నారు. ఆయా వార్డు ప్రజలు, యువకులు ముందుండి సీసీ రహదారులను నిర్మించుకోవడంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. సీసీ రహదారులకు రోజువారి క్యూరింగ్ జరుగుతోందా లేదా అన్న విషయాలను కాలనీవాసులు సైతం తెలుసుకొని సంబంధిత కౌన్సిలర్, సిబ్బందికి తెలియ పర్చాలన్నారు. కాంట్రాక్టర్ రహదారి నిర్మాణంలో నాణ్యత లేకుండా నాసిరకంగా నిర్మిస్తున్నాడని తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని వార్డు ప్రజలు, యువకులకు సూచించారు.

## అంకితభావంతో పనిచేసే వారిని గెలిపించండి



కస్తూర్బా పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు.

వనపర్తి టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) బలపరిచిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎస్ రెడ్డికి మద్దతుగా శనివారం ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, గురుకుల పాఠశాలలో తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ 317తో ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరాలన్న, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారమవ్వాలన్న ఏవీఎస్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఏవీఎస్‌రెడ్డి గెలిస్తే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు పోరాడుతారని తెలిపారు. కార్యక్రమంలో మీడియా కన్వీనర్ శశివర్ధన్, మండల అధ్యక్షుడు రాములు, అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా మండలంలోని పలు గ్రామాలు, పట్టణ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శనివారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు తలకంటి మహిపాల్‌రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై అంకితభావంతో పనిచేస్తున్న అభ్యర్థిగా కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి మొదటి ఓటు ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పాన్‌గల్: పాలమూరు, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్యరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కార్యదర్శి హమీద్ అన్నారు. శనివారం మండలంలోని చింతకుంట, మాందాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాలల్లో ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల మద్దతును కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శేఖర్, శంకర్‌నాయక్, రాము, తారునాయక్ పాల్గొన్నారు.

## నేడు రామన్ టాలెంట్ టెస్ట్

వనపర్తి టౌన్: 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు రామన్ ఐఐటీ టాలెంట్ టెస్ట్ నిర్వాహకుడు రాములుయాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరేళ్లుగా గణిత, భౌతిక, రసాయన శాస్త్రాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆయా సబ్జెక్టుల నిపుణులతో ప్రశ్నాపత్రాన్ని రూపొందిస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. పరీక్ష 11:30 నుంచి 12:30 వరకు ఉంటుందని, జిల్లా కేంద్రంలోని రావూస్, అభ్యాస్ జూనియర్ కళాశాల, గాయత్రి డిగ్రీ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బహుమతులను సైన్స్ డే రోజు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

## కుటుంబ పాలనను సాగనంపుదాం



మాట్లాడుతున్న జలంధర్‌రెడ్డి

ఆత్మకూర్: బీఆర్‌ఎస్ కుటుంబ పాలన సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, శక్తికేంద్రం ఇన్‌చార్జీ సహదేవ్, నియోజకవర్గ కోకన్వీనర్ రేచింతల శ్రీను అన్నారు. శనివారం రాత్రి మండలంలోని తిప్పుడంపల్లిలో ప్రజాఘోష బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబ పాలన అవినీతిమయమని, పచ్చి అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, రాజు, బాలరాజు, రాఘవేంద్ర, నాగేందర్, రాము, ఆనంద్, సూరి, అశోక్, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం



మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: నిత్యావసర సరుకులతో పాటు వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించలేని ప్రభుత్వాలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మండల కేంద్రంలో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రోజువారి రూ.257 కూలిగా నిర్ణయించినా రూ.120 సైతం రావడం లేదన్నారు. ఉపాధి కూలీలకు దినసరి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ రైతు సంఘం మండల అధ్యక్షుడు రవీందర్, సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల బలోపేతానికి తోడ్పాటు



విద్యార్థులతో ఎంఈఓ, దాత

పాన్‌గల్: ప్రభుత్వ బడుల బలోపేతానికి దాతలు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలు, తల్లిదండ్రుల సమావేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గ్రామానికి చెందిన రిటైర్డు లెక్చరర్ సురేందర్‌రెడ్డి పాఠశాలకు రెండు గ్రీన్ బోర్డులు, విద్యా వలంటీర్‌కు రెండు నెలల గౌరవ వేతనం కలిపి రూ.10 వేలు పాఠశాలకు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్, సీఆర్పీ గోవింద్ పాల్గొన్నారు.

## పోషకాహార కిట్ అందజేత



మదనాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం డాక్టర్ పరిమళ, డాక్టర్ భవాని ఆధ్వర్యంలో మండలంలో 15 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ పోషకాహార కిట్లలో గుడ్లు, కందిపప్పు, బియ్యం, నూనె మొదలగు ఆహార పదార్థాలను వినియోగించుకోవడం వల్ల క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రవీందర్‌గౌడ్, ప్రమీల, డీఈఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ ప్రకటించాలి



గోపాల్‌పేట: ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించి ఉద్యోగులకు న్యాయం చేయాలని విద్యుత్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట మధ్యాహ్నం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రవి, శ్రీనివాసులు, చంద్రకాంత్, సుధాకర్ పాల్గొన్నారు.

## సైనిక్‌స్కూల్‌కు విద్యార్థిని..



క్షేత్ర

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామానికి చెందిన క్షేత్ర సైనిక్ స్కూల్‌కు ఎంపికైందని లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకురాలు మీర్జా అన్వర్ బేగ్ తెలిపారు. జనవరిలో జరిగిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించి ఆరో తరగతి సైనిక ప్రవేశ పరీక్షలో పాల్గొని 300 మార్కులకు గాను 253 మార్కులు సాధించిందన్నారు. ఆల్‌ఇండియా స్థాయిలో 2,446 ర్యాంకు సాధించి సీటు దక్కించుకున్న క్షేత్రకు పలువురు అభినందనలు తెలిపారు.

# ఘనంగా స్వయంపాలన దినోత్సవం



కంభాళాపురం పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



పాన్‌గల్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కలెక్టర్‌గా భూమిక, డీఈఓగా పుష్పావతి, హెచ్‌ఎంగా మానసతో పాటు 26 మంది బాలికలు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విద్యార్థి ఉపాధ్యాయులల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మంజుల పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం, జానంపేట ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు ఘనంగా స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కంభాళాపురంలో పాఠశాలలో డీఈఓగా భవాని, ఎంఈఓగా గౌతమి, హెచ్‌ఎంగా గౌతమ్ వ్యవహరించారు. సర్పంచ్ మంజుల, ఎంఈఓ జయరాములు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కురుమయ్య, మురళీధర్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, పార్వతమ్మ, వరలక్ష్మి, మాధవి ఉన్నారు.

## పాతసామాన్ల దుకాణం తరలించాలని ఆదేశం



పాత ఇనుపసామాన్ నిర్వాహకులకు నోటీస్ అందిస్తున్న కమిషనర్ రమేష్

ఆత్మకూర్: జమేదార్ వీధిలో నివాసాల మధ్య పాత ఇనుప సామన్లు, అట్టలు, డబ్బాలు, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సేకరణ చేసి డంపు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన వెంటనే సిబ్బందితో అక్కడికి వెళ్లి పాత సామాన్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడంతో పాటు, రూ.వెయ్యి జరిమాన విధించారు. వారం రోజుల్లోగా ఊరికి దూరంగా దుకాణం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జమేదార్ కాలనీలో విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన తీగ చెట్లను తొలగించి వీధి దీపాలను అమర్చారు. వనపర్తి డిపో మెనేజర్ మహేశ్వరితో ఫోన్‌లో మాట్లాడి ఉదయం 6:15 గంటలకే ఆత్మకూర్ నుంచి బస్సును నడిపించాలని కోరారు. ఆత్మకూర్ నుంచి కొత్తకోట మీదుగా హైదరాబాద్‌కు బస్సును నడిపించాలని కోరగా డీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే బస్సులను నడుపుతామని హామీనిచ్చారు.

## జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ



మేడేపల్లిలో గొర్రెలకు నట్టల నివారణ మందులు తాగిస్తున్న పశువైద్యులు



రేమద్దులలో..

ఆత్మకూర్: మండలంలోని మోట్లంపల్లి, మేడేపల్లి గ్రామాల్లో శనివారం పశువర్ధకశాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టలనివారణ మందులను పంపిణీ చేశారు. ఈ నెల 28వ తేదీ వరకు గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని గొర్రెల్లు, మేకల కాపరులు, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువర్ధకశాఖ ఏడీ శ్రీనివాసులు, డాక్టర్ రమేష్, జేఈఓలు నిర్మల, ఇంద్రజ, సిరాజుద్దీన్, మహిమూద్, సిబ్బంది పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్, ధర్మాపురం గ్రామాల్లో శనివారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామని పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. ఐదో రోజు నాగల్‌కడ్మూర్‌లో 2,983 గొర్రెలు, 321 మేకలు, ధర్మాపురంలో 2,726 గొర్రెలు, 295 మేకలకు నట్టల నివారణ మందులను వేశామన్నారు.

పాన్‌గల్: మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం రేమద్దుల, గోప్లాపూర్ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేసినట్లు మండల పశువైద్యాధికారి డా.శ్యామ్ పేర్కొన్నారు. ఈ రెండు గ్రామాల్లో 17,240 గొర్రెలు, 9,555 మేకలకు నివారణ మందులు తాగించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, ఖుర్షీద్‌అలీ, బుచ్చన్న, చంద్రయ్య, శివశంకర్ పాల్గొన్నారు.

## ఇరువర్గాల మధ్య ఘర్షణ: కేసు నమోదు



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ మండల మైనార్టీ నాయకులు

అమరచింత: పట్టణంలోని ముస్లిం శ్మశానవాటిక స్థలంలో ప్రధాన రహదారికి పక్కన నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారంలో ముస్లింలు రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఇచ్చిన నిధులతో ముందస్తుగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రతిపాదించారు. ప్రధాన రహదారిలోని ఖబ్రస్థాన్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే అందరికి ఉపాధితో పాటు మజీద్ నిర్వహణకు ఆదాయం సమకూరుతుందని భావించిన జామీయా మసీదు కమిటీతో పాటు ముస్లింలు రాజకీయాలకు అతీతంగా ముందుకొచ్చారు. దీంతో జామీయా మసీదు కమిటీ సభ్యులు రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు. కానీ ఎమ్మెల్యే చెప్పిన దానికి విరుద్ధంగా పనులు చేపడుతున్నారని బీఆర్‌ఎస్ ముస్లిం నాయకులు పనులను అడ్డుకున్నారు. ఆగ్రహానికి గురైన బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం నాయకులు పరస్పర దూషణలతో దాడులు చేసుకున్నారు. దీనిపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు విడివిడిగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**దాడికి పాల్పడ్డ వారిపై చర్యలకు డిమాండ్**

బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు మహమూద్‌పై దాడి చేసిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని బీఆర్‌ఎస్ మండల మైనార్టీ నాయకులు కలాంపాషా, శంషీర్, అలీ, సలామ్, బడే సాబ్, మన్సూర్ డిమాండ్ చేశారు.

**తప్పుడు ఆరోపణలు**

మజీద్ కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారమే ఖబ్రస్థాన్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నామని మజీద్ కమిటీ సభ్యులు తెలిపారు. అక్కడే పనులు చేస్తున్న పాషా, అల్తాఫ్, తాఫిక్‌పై దాడి చేసిన మహిమూద్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



గోపాల్‌పేట: ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం రేవల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జరిగిన హెల్త్ క్యాంపును ఆయన సందర్శించారు. భోజనానికి ముందు, తరువాత చేతులు కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. మొత్తం 112 మంది బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. క్యాంపులో డాక్టర్ కిషోర్, ఎస్ఓ జ్యోతి, వైద్య సిబ్బంది కౌసల్య, లక్ష్మి, శివ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## అంధత్వ నివారణ కోసమే కంటివెలుగు



శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంతో అంధత్వ సమస్యలు తీరనున్నాయని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 6 వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని కౌన్సిలర్ యాదమ్మతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో వైద్యులు నిస్సార్ అహ్మద్, రంజిత్‌రెడ్డి, శివలీల, దీపిక, నిఖిత, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్య సిబ్బంది ఉన్నారు.